


# రాళ్ళు

డా. ఏల్చూరి విజయరాఘవరావు.

కని విని ఎరుగని కుండపోత.

వానకాదది, వరుణాస్త్రవాహిని.

కాలానికి మారణయోగం విరచిస్తున్న విధి.

చినిగి, గడ్డి పరకల్లా తేలుతూ, చీకటి పొదల ఎదలను చీల్చుకుని ప్రవహిస్తున్న చరిత్ర పుటల రోదనాలాపనలో, అతికినా అతకని అపస్వరాలు కొన్ని, ఇవి....

దేవుడి పటం పక్కన, కిటికీలో కూర్చొని, ఎన్నిసార్లు పని వాళ్ళు శుభ్రం చేసినా, వాళ్ళ చేతికందకుండా, కిటికీచువ్వల్లోంచి ఇంట్లో జరిగే తతంగమంతా చూస్తున్న రెండురాళ్ళు....

ఈ రోజు వాటి సంభాషణ

"అక్కా! ఇక మనం ఊరు విడిచి వెళ్ళిపోవాల్సిందే"

"అరే! నువ్వుకూడా వానకు భయపడ్డావా!?హంసతూలికా తల్పాల్లో పడుకున్నా సరే, జరిగేదేదో జరిగి తీరుతుంది చెల్లీ. ప్రళయమొచ్చినా 'రాతిగుండెలు' తొనకవు, మరి"

"అద్గదే! ఆ మాటలంటేనే ఒళ్ళుమండుతుంది. ఎంత అన్యాయం! - మనిషి గుండెలను మనతో పోలుస్తారు కవులు! మనకన్నా అతి కర్కశంగా ఈ రోజుల్లో మనుష్యులే వ్యవహరిస్తున్నారన్న ఇంగిత జ్ఞానం వాళ్ళ కుండక్కర్లేదా?"

రెండో రాయి జవాబిస్తోంది.

"చెల్లాయ్! 'రాతిగుండెలు... రాతిగుండె'లని చర్విత చర్వణం చెయ్యటం వాళ్ళ కలవాటులే. ఈ కాలపు బ్రతుకుల్లో కనీసం, మనరాళ్ళకున్న నిజాయితి కూడా మనుషులకు లేదని, రచయితలకు తెలిసినా, ఖచ్చితంగా కాయితం మీద పెట్టటానికి బుర్ర కావాలి గదుటోయ్! కమ్మటి సంగీతం వింటూంటే, ఆస్తిత్వాన్ని మరిచిపోయి, రాళ్ళు కరుగుతాయి. మరి మనుషులో! - సొంత తల్లుల్నీ, బిడ్డల్నూ, తోబుట్టువులనూ, పిట్టల్లా కాల్చేసి పారేస్తూనే, కొంచెమైనా పాపభీతి లేకుండా - ఈ రాక్షసులు - యధావిధిగా 'మనుషుల్లా చలామణీ అవుతూనే ఉన్నారు చూడు మరి!"

"పోనీ - మనకెందుకులే ఈ రాద్ధాంతమంతా. వారం రెండు వారాల్నుంచి నీవాలకం చూస్తున్నా. కిటికీలోంచి మహా మహా తొంగిచూస్తున్నావే! - ఏమిటి సంగతి?"

"తెలీనట్టు నాటకమాడకు. ఈ ఇంట్లో రోజూ జరిగే రామాయణం చూడకుండా కళ్ళు మూసుకుని ఎంత కాలం కూచుంటాం మరి"...

తాసీల్దారుగారి బంగళా.

వెనకవైపు దొడ్లో బ్రహ్మాండమైన పూలతోట. తోట మధ్య, తరాలుగా ఎదిగి, ఎన్నెన్ని పక్షులకో జీవనాధారంగా నిలుస్తూ, తన ఛత్రచ్ఛాయి కింద కాలక్షేపం చెయ్యదల్చుకున్న ప్రతి ప్రాణికీ, జాతిమత విచక్షణ లేకుండా చల్లటి నీడననవరతం ప్రసాదిస్తున్న 'వటవృక్షం'.

ఆ మ్రి చెట్టుకింద ఎంతమంది పిల్లలాడుకునేవాళ్ళో! తనకే జ్ఞాపకం లేదు.

కానీ! -

మొన్న మొన్ననే జరిగిన తాసీల్దారుగారబ్బాయి వివాహమహోత్సవపు విందు వివరాలు మాత్రం మరచిపోలేదు. ఆ'తాగుడు పార్టీ'లో లక్షలు ఖర్చయినై... పగిలిన షాంపేన్ బాటిళ్ళ సీసపు ముక్కలింకా గుచ్చుకుంటుంటే సహించలేక, భూగర్భంలోకి చొచ్చుకుపోయి దాక్కున్నట్టున్నాయి వటవృక్షపు వేళ్ళు!

ఆ ఇంట్లో జరిగే తంతంతా దశాబ్దాలుగా కళ్ళారా చూసింది వృక్షం. తాసీల్దారుగారి తాతగారు, తన ముద్దు మనవడికుపనయనం చేస్తూ, వెయ్యమందికి పైగా బీదవాళ్ళకు కడుపునిండా భోజనం పెట్టినినాడు, తనెంతో మురిసిపోయింది. సన్నాయి వాళ్ళు తియ్యగా మంగళవాద్యం వాయిస్తుంటే, ఒళ్ళు పులకరించేది. ప్రతి ప్రాతఃకాలమూ

గాయత్రీ మంత్రం వల్లిస్తున్న వటువును చూస్తూ కళ్ళ పండుగయ్యేది. మళ్ళీ గోధూళి సమయానికి పూలన్నీ మందస్మితవదనారవిందంతో తమను గిలిగింతలు పెడ్తుంటే, పక్షులన్నీ సరసల్లాపాలాడటం చూస్తూ చూస్తూ, ‘ముసి‘ ‘ముసి‘ నవ్వులు నవ్వుకునేది తను.

ఈమధ్య కథ మారింది!

తాసీల్దారుగారి హయామొచ్చినప్పటి నుంచీ కన్నీళ్ళే కన్నీళ్ళు.

ఎందుకంటారా?

జవాబుకోసం, పక్కనే కిటికీలో కూర్చున్న ఆ రాళ్ళ సంభాషణ వింటూ పోండి

"అదా కథ! నిన్న దొడ్లో , మఱ్రి చెట్టు మామతో, పూస గుచ్చినట్టు కబుర్లు చెప్తున్నావ్! తాసీల్దారు గారబ్బాయి తంతు గురించే కదూ? వాడిని - పాపం - దయ్యం పట్టి పీక్కుతింటోందేమో! - పెళ్ళై, పట్టున పదివారాలైనా గడవలేదు; రోజుకొక కొత్తమ్మాయిని వెంటేసుకొచ్చి తల్లీ పెళ్ళాం ముందరే తందనాలాడుతున్నాడు! లంచాలు తింటూ, రాత్రింబవళ్ళు భ్రష్టజీవిత పద్మవ్యూహంలో ఇరుక్కున్న కామనాజాలంతో తడబడుతున్నా తాసిల్దారుగారికీలంపటంతో ప్రమేయమే ఉన్నట్టు లేదు! తల్లి, చెప్పి చెప్పి తలబాదుకున్నా అబ్బాయి వినడు....

ఎంత నెమ్మదస్తురాలో, కొత్తగా కాపురానికొచ్చిన సాధ్వి! భరిస్తూ పెదవి కదపలేదింతవరకూ..."

మొదటిరాతి ముక్క దిగులుగా అన్నది "జాగ్రత్త. ఆ అబ్బాయిది ‘రాతిగుండె‘ అని వర్ణిస్తూ, రచయితలు మళ్ళీ పొరపాటు చేస్తారేమో - అల్లాంటి నీచుణ్ణి మనతొ పోల్చితే నాకు ఒళ్ళు మండుకురాకేం చేస్తుంది?" రెండో రాయి

"అద్సరే విను. నిన్న రాత్రి జరిగిన దారుణం మఱ్రి చెట్టు మామతో వర్ణిస్తూ వర్ణిస్తూనే తెల్లవారింది. కాస్త పోలీసు గొడవ తగ్గితే, మిగతా కథలోని క్షీరనీరన్యాయం సొంతం బైటపడ్తుంది."

"సరే ననుకో అక్కా! ఈ కుండపోత వానల బాధకు తోడు, ఇదొక దుస్వప్నం కదా... కళ్ళు మూతపడటం లేదు....చెప్తూపో తల్లీ..... ఆ రభస వివరాలు మరికొన్ని విన్నాకనే, ఒళ్ళు మంట కాస్త తగ్గుతుందేమో నాకు"

"రాత్రి ఆ అబ్బాయి "ఫుల్"గా తాగొచ్చాడు. అప్పుడా ఇంట్లో మరో సరికొత్త రభస... వరదల్లో పంటలన్నీ పాతాళం పాలై, కొంప మునిగిన రైతు - రామలింగం - నిన్న మధ్యాహ్నం ‘పన్ను కట్టలేననీ, ఈసారికి క్షమించ‘మనీ తాసీల్దారుగారి కాళ్ళ మీదపడి ప్రాధేయ పడ్డాడు గదా.... ఆ తర్వాత, ఏం జబర్దస్తీ కుంభకోణం చేశాడో ఈ వినాశకుడు! - రామలింగానికి పెళ్ళిగావాల్సిన ఒక్కగానొక్క కూతురుంది గదూ; ఆ పడుచును వెంటేసుకొచ్చాడీతగాడు!

వెయ్యి విధాల తల్లి నచ్చ చెప్పింది. వినలేదు. ఇక భరించలేక, కొత్త పెళ్ళికూతురు భర్త కాళ్ళమీద పడి, ఇలా చెయ్యొద్దనీ, ఇంత అన్యాయం సహించలేననీ, మొక్కుకున్నది. ఈవిడ తల్లిదండ్రులు తీర్చని ‘కట్న దాహం‘ అదివరకే వీడి నరాల్లో చిచ్చు బెట్టిందేమో; ఒఖ్ఖ పరుగున బైటకెళ్ళి, కారులోంచి పెట్రోలు తెచ్చి, ఆ నిరపరాధి అమ్మాయి పై నిలువునా పోసేశాడు!!

నేను నివ్వెరపోయి చూస్తూనే నుంచున్నా!! తన తల పగలగొట్టుకుంటూ ‘గావు‘కేక లేస్తోంది నిస్సహాయంగా, కన్న తల్లి....

తాళి బొట్టు పచ్చలారని భార్యను దారుణంగా దగ్ధం చేస్తూ, చేతిలో రివాల్వర్ ఝుళిపిస్తూ, మరో చేత్తో రామలింగం కూతురుని రెక్కబట్టి లాక్కుపోతూ, తృటిలో ఎటో మాయమైపోయ్యాడా త్రాష్టుడు!!

వింటూన్న రెండో రాయి గుండెలు మంచులా కారి దిగజారిపోతున్నై....

మళ్ళీ కుంభ వృష్టి.. సుడిగాలి... ఉరుములూ, మెరుపులూ... భయంకరమైన తుఫాను...

వటవృక్షం కొమ్మలన్నీ - ఒకటి వెంట మరొకటి - విరుగుతూ తలొక దారి పోతున్నై.... రంగు రంగుల పూలన్నీ రాలి, మురికి నీళ్ళల్లో పడి గమ్యాన్ని కోల్పోయిన పథికుల్లా. వెల్లువలో అటూ ఇటూ కొట్టుకుపోతున్నై ఆకారరహితంగా....

ఆ బీభత్సంలో అణుబాంబులు పేలుతున్నా హోరుగాలికి, ఆకూ అలమూ తిత్తరబిత్తరై ఈసారి తప్పించుకోలేక, రాళ్ళు రెండూ చెదిరి, వేర్వేరు సుడిగుండాల్లో తలవాల్చినై...

మొదటి రాయి ఏడుస్తూ గొంతెత్తి అరిచింది "అక్కా! దిగులు పడకు. ఇలాంటి హింసా కాండ దానవులవుతున్న మానవులను శిక్షించడానికేననుకుందాం. మళ్ళీ జన్మంటూ ఉంటే, కలవక కలవక మనమిద్దరమూ కలుస్తే, మనిషిని మనిషిగా గుర్తించే మానవుల ఇంట్లోనే కాపురం చేద్దాం. వెళ్ళొస్తా..."

రెండో రాయి

"అవును తల్లీ! రాతి గుండెలీకాలపు మనిషిగుండెలంత నీచం కాదు గనక తప్పక కలుద్దామని ఆశ. జై జై...."

'బట్వారా' పూర్తయింది...

వటవృక్షం కింద మారణ నిశ్శబ్దం...

తాసిల్దారుగారి కోడలి శవం కాలి, గుర్తుపట్టలేకుండా, నల్లగా చీకట్లో కలిసిపోయింది. దూరంగా, చెరొక కాలువలో, రెండురాళ్ళూ, నోరులేని ఈ శవంలాగే, మబ్బుల్లోకి గుడ్లు గుచ్చుకుని, మన్నుదిన్న పాముల్లా పడుకున్నై...

వికలాంగమై, నిలువునా కుంగినా, రాబోయే రామరాజ్యం కోసం నిరీక్షిస్తూనే ఉంది వట వృక్షం!

కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన
తాటిపాముల మృత్యుంజయుడు కథ
'అందమైన పువ్వు' చదవడానికి
ఇక్కడ క్లిక్ చేయండి..!